# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఒక దేశం... ఒక ఎన్నికకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించింది.
- ❖ భవిష్యత్తులో భారత్ మిగులు విద్యుత్ దేశంగా అవతరిస్తుందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.
- ❖ అమిత్ షా వ్యాఖ్యలపై విపక్షాలు చేపట్టిన ఆందోళనలతో పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదాపడ్డాయి.
- ❖ ప్రయాగ్‌రాజ్‌లో జరుగనున్న మహా కుంభమేళాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్ల ముందస్తు రిజర్వేషన్లు రేపటి నుంచి అందుబాటులో ఉంటాయని రైల్వే శాఖ తెలిపింది.

==============================

"ఒక దేశం... ఒక ఎన్నిక"కు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం 31 మంది సభ్యులతో కూడిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపించింది. ప్రతిపాదిత కమిటీలో 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. భారతీయ జనతా పార్టీ ఎంపీలు పీపీ చౌదరి, అనురాగ్ సింగ్ ఠాకూర్, పర్షోత్తంభాయ్ రూపాలా, కాంగ్రెస్ ఎంపీలు ప్రియాంక గాంధీ, మనీష్ తివారీ, టీఎంసీకి చెందిన కల్యాణ్ బెనర్జీ, ఎన్సీపీకి చెందిన సుప్రియా సూలే తదితరులు జేపీసీలో సభ్యులుగా ఉన్నారు. ఈ బిల్లులకు అధికారికంగా 129వ రాజ్యాంగ సవరణ బిల్లు 2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు 2024 అని పేరు నామకరణం చేశారు.

==============================

భవిష్యత్తులో భారత్ మిగులు విద్యుత్ దేశంగా అవతరిస్తుందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఎలక్ట్రానిక్ వాహనాల పరిశ్రమ సుస్థిరతపై ఈరోజు నిర్వహించిన 8వ క్యాటలిస్ట్ కాన్ఫరెన్స్ - ఎ వెక్స్‌పో 2024లో ఆయన ప్రసంగించారు. భారత దేశానికి జలవిద్యుత్ లో అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఈ పరిశ్రమ ను ప్రభుత్వం సమర్థంగా అభివృద్ధి చేస్తోందని నితిన్ గడ్కరీ వివరిస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

==============================

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఈరోజు పార్లమెంట్ ఉభయ సభల కార్యకలాపాలు వాయిదాపడ్డాయి. మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడిన తర్వాత లోక్‌సభ తిరిగి సమావేశమైనప్పుడు, కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ ల పార్లమెంట్ సభ్యులు స్పీకర్ సమీపానికి వెళ్లారు. కొందరు సభ్యులు లోక్‌సభ స్పీకర్ కుర్చీ వద్దకు చేరుకుని కేంద్ర హోంమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గందరగోళం మధ్య, ప్రిసైడింగ్ అధికారి సభను రేపటికి వాయిదా వేశారు.

==============================

ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగనున్న మహా కుంభమేళా సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 34 ప్రత్యేక రైళ్లను నడపనున్నామని మధ్య రైల్వే ముంబాయి ప్రకటించింది. కుంభమేళా జనవరి 13 నుండి ఫిబ్రవరి 26వ వరకు ప్రయాగ్‌రాజ్‌లో జరుగనుంది. యాత్రికుల కోసం ఈ ప్రత్యేక రైళ్లు ముంబై, పూణే, నాగ్‌పూర్ వంటి ఇతర నగరాల మీదుగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. కుంభమేళా ప్రత్యేక రైళ్ల ముందస్తు రిసర్వేషన్లు రేపటి నుండి అన్ని PRS కేంద్రాల్లోనూ అలాగే www.irctc.co.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని రైల్వే శాఖ వెల్లడించింది.

==============================

ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యోదయ యోజనను ప్రవేశపెట్టిందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ అన్నారు. ఈ రోజు న్యూ ఢిల్లీలో వికసిత్ భారత్ 2047 కోసం ట్రాన్స్‌ఫార్మింగ్ హెల్త్‌కేర్ అనే అంశంపై జరిగిన వైద్య సదస్సులో ఆమె మాట్లాడుతూ.... ఆసియాలో భారతదేశం నాల్గవ అతిపెద్ద వైద్య పరికరాల మార్కెట్ అని పేర్కొన్నారు. వైద్య పరికరాల కోసం ఎగుమతి ప్రోత్సాహక మండలి ఏర్పాటుతో పాటు.. ఎగుమతులను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అనుప్రియ పటేల్ పేర్కొన్నారు.

==============================

దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో ఈ రోజు ఉదయం భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు మరణించగా.. ఇద్దరు సైనికులు కూడా గాయపడ్డారని ఆర్మీ అధికార ప్రతినిధి తెలిపారు. గత రాత్రి, ఉగ్రవాదుల ఉనికిపై అందిన సమాచారం మేరకు భద్రతా బలగాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఖాదర్ గ్రామంలోని అనుమానిత ప్రదేశానికి బలగాలు చేరుకోగానే అక్కడ దాక్కున్న ఉగ్రవాదులు వారిపై విచక్షణా రహితంగా భీకర కాల్పులకు పాల్పడ్డారని దీంతో ఎదురు కాల్పులు జరిపారని భద్రతా వర్గాలు తెలిపాయి. మరణించిన ఉగ్రవాదుల గుర్తింపును పరిశీలిస్తున్నామని ఆర్మీ అధికార ప్రతినిధి వెల్లడించారు.

విరామం

==============================

దేశంలో కబడ్డీ, ఖో-ఖో, రెజ్లింగ్, ఫుట్‌బాల్ వంటి క్రీడలను ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా పథకంతో సహా అనేక పథకాలు అమలు చేస్తున్నామని యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా పేర్కొన్నారు. ఖేలో ఇండియా- జాతీయ క్రీడల అభివృద్ధికి క్రీడా సమాఖ్యలకు సహాయం అందిస్తుందన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పెన్షన్, జాతీయ క్రీడాభివృద్ధి నిధి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా క్రీడా శిక్షణా కేంద్రాల నిర్వహణ వంటివి దేశంలో అమలవుతున్నాయని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్రామీణ కుటుంబాలకు ఇంకా 100 శాతం కుళాయి నీటి కనెక్షన్ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పని చేస్తున్నామని కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... ఇప్పటికీ 4 కోట్ల కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లు లేని నేపథ్యంలో మంత్రిత్వ శాఖ ఆయా రాష్ట్రాలతో చర్చలు జరుపుతోందని తెలిపారు. ఈ మిషన్ గడువు ముగిసినప్పటికీ, ఇంకా అనుసంధానించబడని గృహాల అవసరాల దృష్ట్యా ప్రభుత్వం పునరుద్ధరించాలని చూస్తోందని కేంద్రమంత్రి పేర్కొంటూ.....

(వాయిస్ 39 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, పాకిస్తాన్ మధ్య - 2027 వరకు జరగబోయే క్రికెట్ మ్యాచ్‌లు తటస్థ వేదికలలో జరుగుతాయని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ఈ రోజు వెల్లడించింది. వచ్చే సంవత్సరం పాకిస్థాన్‌లో ఫిబ్రవరి నుండి ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీపై గత కొద్ది రోజులుగా అనిశ్చితి నెలకొంది. పాకిస్తాన్ లో పర్యటించేందుకు భారత్ విముఖత చూపడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని ఐసిసి ప్రకటించింది. దీంతో ఈ టోర్నమెంట్ హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించనున్నామని.. ఇది 2025లో భారత్ నిర్వహించే ఐసిసి మహిళల క్రికెట్ ప్రపంచ కప్ తో పాటూ.. ICC పురుషుల T-20 ప్రపంచ కప్ 2026కి కూడా వర్తిస్తుందని ఐసిసి స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఈరోజు సెన్సెక్స్ 80,182 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 964 పాయింట్ల నష్టంతో 79,218 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 247.15 పాయింట్ల నష్టంతో 23,951 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.08 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 73 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,635 డాలర్ల స్థాయి వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

60 సంవత్సరాలు పైబడిన ప్రముఖ కళాకారులు పండితుల కోసం సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సహాయ పథకాన్ని ప్రారంభించిందని కేంద్ర ప్రభుత్వం ఈరోజు తెలిపింది. 60 ఏళ్లు నిండిన వృద్ధ కళాకారులు, పండితులకు నెలకు గరిష్ఠంగా 6 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడమే ఈ పథకం ఉద్దేశమని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈ రోజు రాజ్య సభలో ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =